క్లుప్తంగా

ప్రతిభను మెరుగుపరుచుకోవాలి



రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సుకు ఎంపికైన విద్యార్థులు

మద్దికెర: విద్యార్థులు ప్రతిభను మెరుగుపరుచుకొని ఉన్నతంగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు విజయరాజు అన్నారు. మద్దికెరలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, రంజిత్‌లు రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సుకు ఎంపిక కావడంతో మంగళవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో కర్నూలులో జరిగిన ఇన్‌స్పైర్ సైన్స్ సదస్సులో నమూనా ప్రాజెక్టును ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



నెరణికి కొండల్లో బెల్లం ద్రావణాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి కొండల్లో మంగళవారం హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాలను గుర్తించి సారా తయారీ కోసం బిందెల్లో నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం ద్రావణాన్ని, బిందెలను ధ్వంసం చేశారు. కొండల్లో పెద్దఎత్తున సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం నుంచి కొండల్లో గాలించి స్థావరాలను గుర్తించి ధ్వంసం చేశారు. నాటుసారా సేవించడం, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు, జైలు శిక్ష తప్పదని ఎస్‌ఐ హెచ్చరించారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్‌ను పట్టణంలోని వ్యాపారులు విక్రయించినా, ఉపయోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాలాజీ హోటల్, అక్కడే ఉన్న టీస్టాల్‌ను ఆయన తనిఖీ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తుండడంతో వ్యాపారులకు రూ.4 వేలు జరిమానా విధించారు. హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. బస్టాండ్ ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించి వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఖబరస్తాన్ కొట్టాల, గోనెగండ్ల రోడ్, విశాల్ మార్ట్, హెచ్‌బీఎస్ కాలనీ ఏరియాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో కార్మికుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ దివాకర్

ఆలూరు రూరల్: వ్యవసాయ బోరు కనెక్షన్ కోసం తీగలు లాగుతుండగా కరెంట్‌షాక్ తగిలి దివాకర్ అనే విద్యుత్ కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. హత్తిబెళగల్ గ్రామానికి చెందిన దివాకర్ ఆలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మీటర్ రీడర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం కరిడిగుడ్డం సమీప పొలాల్లో వ్యవసాయ బోరు కనెక్షన్ కోసం విద్యుత్ తీగలు లాగేందుకు కాంట్రాక్టర్ పిలవడంతో దివాకర్ పనికి వెళ్లాడు. మరమ్మతు పనులు చేస్తుండగా 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఒక్కసారిగా షాక్ తగిలి స్తంభం నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో దివాకర్ వీపు భాగం, కాళ్లు తీవ్రంగా కాలిపోయాయి. క్షతగాత్రుడిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

గడ్డివామి దగ్ధం

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామ శివారులోని సుంకులమ్మ ఆలయం పక్కన మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బోయ నెంగి శంకరన్నకు చెందిన గడ్డివామి కాలి బూడిదైంది. దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించింది. 10 ట్రాక్టర్ల గడ్డి ఈ ప్రమాదంలో కాలిపోయినట్లు సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కొత్తింటి వెంకటరెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని చెప్పారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

గ్రామీణ రహదారులు కళకళ

- సౌకర్యవంతంగా మారిన గ్రామీణ రోడ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్లకు మహర్దశ



నాడు - అధ్వానంగా ఉన్న కొత్తపేట - పుల్లాపురం రహదారి



నేడు - సౌకర్యవంతంగా రూపుదిద్దుకున్న తారు రోడ్డు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట, పుల్లాపురం, దేవనకొండ, వరిముక్కల, వెలమకూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు గతంలో అధ్వానంగా ఉండేవి. గతంలో పాలకులు ఏనాడూ రోడ్ల సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదట గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి, తర్వాత క్రమంలో రోడ్ల వ్యవస్థపై దృష్టి సారించింది. అందులో భాగంగా దేవనకొండ-వరిముక్కలకు రూ.1.20 కోట్లు, వెలమకూరు రోడ్డుకు రూ.70 లక్షలు, కొత్తపేట-పుల్లాపురం గ్రామాల మధ్య తారు రోడ్డును రూ.2.95 కోట్లతో నిర్మించారు. ఈ మార్గంలో కొత్తపేటలో వెలసిన మస్తాన్‌వలీ ఉరుసులో ప్రతి సంవత్సరం వేలాది భక్తులు పాల్గొంటారు. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. గత కొన్ని దశాబ్దాల నుంచి పాలకులు ఉరుసుకు రావడం రోడ్డు వేస్తామని మాట ఇవ్వడం తర్వాత మరిచిపోవడం పరిపాటిగా సాగింది. అలాగే దేవనకొండ-వరిముక్కల మధ్యలో మట్టి రోడ్డు ఉండేది. ఆ మార్గంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంతో రోజూ విద్యార్థులు వందల సంఖ్యలో కళాశాలకు వస్తూ పోతూ ఉంటారు. వర్షం వచ్చిందంటే బురదమయంగా మారేది. ఎక్కడ జారిపడతామోనని విద్యార్థులు భయాందోళనకు గురయ్యేవారు. గతుకుల రోడ్డులో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కొత్తగా రోడ్డు నిర్మించడంతో విద్యార్థులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నిరీక్షణ చేసిన వారికి ప్రయాణం సుగమం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్తపేట-పుల్లాపురం రోడ్డు సంవత్సరాల తరబడి అధ్వానంగా ఉండేది. ఏ నాయకుడు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్డును నిర్మించి ప్రజల సమస్యలను పరిష్కరించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రోడ్లను నిర్మించడం పట్ల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



నాడు - దేవనకొండ-వరిముక్కల మధ్య మట్టి రోడ్డు



నేడు - సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం

ఏళ్ల నాటి సమస్య పరిష్కారమైంది



ఎన్నో ఏళ్లుగా నెలకొన్న రోడ్డు సమస్య వైఎస్సార్‌సీపీ పాలనలో పరిష్కారమైంది. గతంలో కొత్తపేటకు రోడ్డు లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. మస్తాన్‌వలీ ఉరుసు సమయంలో భారీగా భక్తులు రావడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం రోడ్డు నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

– మధు, కొత్తపేట గ్రామస్తుడు

రోడ్డు సమస్య తీరింది



పుల్లాపురం – కొత్తపేటకు చాలా ఏళ్లుగా రోడ్డు అధ్వానంగా ఉండేది. ఈ రహదారిలో ప్రయాణించి చాలా సార్లు ప్రమాదాల బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయి. నేడు వైఎస్సార్సీపీ ప్రభుత్వం పుల్లాపురం-కొత్తపేటకు రోడ్డు నిర్మించడం సంతోషంగా ఉంది. రోడ్డు నిర్మాణంతో ప్రయాణ కష్టాలు తొలగాయి. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– చిన్నకౌలుట్ల, పుల్లాపురం గ్రామస్తుడు

పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఉప్పర్లపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ షర్మిల

తుగ్గలి: మండల పరిధిలోని ఉప్పర్లపల్లి, బాటతండ, పగిడిరాయి, పి.కొత్తూరు, రామలింగాయపల్లి, చెన్నంపల్లి కడమకుంట్ల, శభాష్‌పురం, రాంపల్లిల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ షర్మిల పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్తు, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆమె వెంట ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలోని నాలుగు పోలింగ్ బూత్‌లలోని 12 పోలింగ్ స్టేషన్లు, అలాగే బింగిదొడ్డి, సూదేపల్లె, గుంటుపల్లె, లక్ష్మి నగరం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ శివశంకరప్ప పరిశీలించారు. ఆయా బూత్‌లలో ఓటింగ్ నిర్వహించేందుకు గల పరిస్థితులు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాల వివరాలు సేకరించారు. పలు స్టేషన్లలో ఓటింగ్ నాటికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆర్‌ఐ మస్తాన్, బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఉన్నారు.

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, బల్లోట, కుర్లేహళ్లి, నిట్రవట్టి, బిలేహాల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ బ్యూల పరిశీలించారు. కొత్తగా ఫారం-6 ఓటర్లు నమోదు చేసిన దరఖాస్తులను పరిశీలించారు. చనిపోయిన వారి ఓటును వారి కుటుంబసభ్యులను నుంచి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకొని ఫారం-7 ద్వారా మాత్రమే తొలగించాలన్నారు. అనంతరం సచివాలయంలో జరుగుతున్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మద్దికెర: రానున్న ఎన్నికలకు గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ అలివేలమ్మ ఆదేశించారు. మంగళవారం పెరవలి గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, ఏఓ స్వర్ణకుమారి ఉన్నారు.

మార్కెట్ వేలాలతో భారీ ఆదాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు మార్కెట్లకు మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. కమిషనర్ గంగిరెడ్డి, ఆర్‌ఓ బేబీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో గత సంవత్సరం కంటే ఈ ఏడాది రూ.4,86,000 ఆదాయం అదనంగా మున్సిపాలిటీకి సమకూరింది. మంగళవారం నిర్వహించిన వేలం పాటలో రోజువారీ మార్కెట్‌ను డి.మునీర్ రూ.27,57,000లకు దక్కించుకోగా, వారపు పశువుల మార్కెట్‌ను బి.రామకృష్ణ రూ.15,62,000లకు, గొర్రెల మార్కెట్‌ను ఎస్.రాము రూ.15,66,000లకు, మాంసం మార్కెట్‌ను కె.రహిమాన్ సాహెబ్ రూ.1,35,000లకు, గొర్రెల కమేళాను హనీఫ్ రూ.1,29,000లకు వేలంలో దక్కించుకున్నారు. వారపు మార్కెట్ వేలం మాత్రం వాయిదా వేశారు. మున్సిపల్ ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.వెంకటేశ్వర్లు అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థి వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన అభినందించారు. గతేడాది డిసెంబర్ 20న కర్నూలులో జరిగిన అథ్లెటిక్ షాట్‌పుట్‌లో జి.వెంకటేశ్వర్లు ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు వెల్లడించారు.

పాఠశాల స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పారిశ్రామిక నైపుణ్యం పెంచుకునేలా, ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదిగేలా పాఠశాలల్లో ఈఎండీపీ (ఎంటర్‌ప్రిన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని కార్యక్రమ జిల్లా కో-ఆర్డినేటర్ గోపాల్ అన్నారు. మండల పరిధిలోని సూదేపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఈఎండీపీ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయిని నాగమణి ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థుల ప్రదర్శనలను ఆయన పరిశీలించి అభినందించారు. హెచ్‌ఎం వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

ఆలూరు: పత్తికొండ డివిజన్ పరిధిలోని మేజర్, మైనర్ గ్రామ పంచాయతీలలో మార్చి నెలాఖరు నాటికి, గృహాలు, కుళాయి పన్ను వసూళ్లను సిబ్బంది వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ ప్రకాష్‌నాయకుడు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఆలూరు మేజర్ గ్రామపంచాయతీలో మంగళవారం ఆయన బిల్ కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మేజర్ గ్రామపంచాయతీలతో పాటు 220 వరకు మైనర్ గ్రామపంచాయతీలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామ పంచాయతీల నుంచి అన్ని రకాల పన్నులు రూ.2 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉందన్నారు. సిబ్బంది పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఆస్పరి గ్రామ పంచాయతీని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తాగునీటిని వృథా చేయొద్దు

ఆలూరు: ఎస్‌ఎస్ ట్యాంకుల నుంచి గ్రామాలకు విడుదల చేస్తున్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య ప్రజలకు సూచించారు. హాలహర్వి మండలం బాపురం గ్రామ సమీపంలో ఎస్‌ఎస్ ట్యాంకు ఆవరణ చుట్టూ పెరిగిన ముళ్ల పొదలు, పేరుకుపోయిన పాచిని వాటర్‌మెన్‌ల చేత మంగళవారం తొలగించారు. అలాగే వాటర్ పంపింగ్ స్టేషన్‌ను, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ.. ఎస్‌ఎస్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తుండడంతో నియోజకవర్గంలోని 11 ఎస్‌ఎస్ ట్యాంకులలో అన్ని గ్రామాల ప్రజలకు మూడు నెలలకు సరిపడే నీటిని నిల్వ ఉంచామన్నారు. ట్యాంకులలోకి చెత్తా, చెదారం, ముళ్ల పొదలు, జీవాల కళేబరాలు పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈలు, సిబ్బంది వెంట ఉన్నారు.

'ఆరోగ్య సురక్ష' ఓ సువర్ణాధ్యాయం



చుంచుఎర్రగుడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే మహోన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఓ సువర్ణాధ్యాయమని సర్పంచ్ కురువ మహాదేవమ్మ అన్నారు. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, వైద్యాధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైఎస్ జగనన్న పేద ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధతో గ్రామాలకే వైద్య బృందాలను పంపి, ఏడు రకాల ఆరోగ్య పరీక్షలు చేయించి, 170 రకాల మందులు ఉచితంగా అందజేసే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. సచివాలయ పరిధిలో 402 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడిక తొలగింపు

హొళగుంద: మండల పరిధిలోని పెద్దగోనెహాళ్ గ్రామంలో చాలకాలంగా డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను మంగళవారం సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి తొలగింపు పనులు చేపట్టారు. ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు గతంలో డ్రైనేజీ ఉండేది. కాలక్రమేణా ఎవరు పట్టించుకోకపోవడంతో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి కనుమరుగైంది. దీంతో ఎస్సీ కాలనీతో పలు వీధుల్లో రోడ్డుపైనే మురుగు నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడేవారు. మంగళవారం సర్పంచ్ ఆధ్వర్యంలో పూడిక తొలగింపు, డ్రైనేజీ ఏర్పాటు పనులు చేశారు. చాలాకాలంగా నానా అవస్థలు పడ్తున్న గ్రామస్తులకు సమస్య తీరిందని సర్పంచ్ తెలిపారు.


కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని ధణాపురం, నాగనాథనహళ్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం, సారాను తరలిస్తున్న ముగ్గురిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. హొళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన ఆదోని మైలారప్ప, కురువ చలువప్ప, ఆదోని పట్టణం వాల్మీకినగర్‌కు చెందిన బోయ సూర్య అలియాస్ సూరి రెండు మోటార్‌సైకిళ్లపై 90 ఎంఎల్ పరిమాణం గల కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 1,728 టెట్రా ప్యాకెట్లు (18 బాక్సులు), 50 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నామని వెల్లడించారు. రెండు మోటార్ సైకిళ్లు, మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, సారాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు, హెచ్‌సీ రామయ్య, కానిస్టేబుళ్లు నీలకంఠ, కాశీలింగం, కిరణ్‌కుమార్, ఆదోని రూరల్ హెచ్‌సీ నాగరాజు, కానిస్టేబుల్ సుధాకర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయొద్దు

మద్దికెర: ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీలలో వేయడం వల్ల నీరు ముందుకు పారకుండా నిల్వ ఏర్పడి దుర్వాసన వెదజల్లడమే గాక, దోమలు విపరీతంగా పెరుగుతాయని సర్పంచ్ కారుమంచి మల్లికార్జున అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో డ్రైనేజీ కాలువలో మురుగును తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హోటళ్ల నిర్వాహకులు, ప్రజలు కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల అందరికీ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీని ఎంత శుభ్రం చేసినా ప్లాస్టిక్ పేపర్లు, గ్లాసులు ఉండడం వల్ల నీరు ముందుకు పారడంలేదన్నారు. వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయరాదని సూచించారు. అందరి సహకారంతో గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకుందామని పిలుపునిచ్చారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

హొళగుంద: మండలం పరిధిలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ దేవి ఆలయం ప్రారంభంతో పాటు నవగ్రహాల ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేద పండితులు, పురోహితుల మంత్రోచ్ఛరణాల మధ్య భక్తులు హోమాలు జరిపారు. జె హొసళ్లి మఠం పీఠాధిపతులు అజాత శంభులింగ స్వామి శివాచార్యులు హాజరై భక్తులను ఆశీర్వదించారు. అలాగే విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు శివాచార్యుల ఆశీస్సులు తీసుకోగా ఆయన ధర్మ సందేశాలు వినిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

లబ్ధిదారులకే భూమిపై హక్కులు



వీరన్న గట్టు సమీపంలో స్థలాలను పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి

వెల్దుర్తి(కృష్ణగిరి): దళితుల అభివృద్ధికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేటాయించిన భూముల క్రయవిక్రయాలు చెల్లవని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి స్పష్టం చేశారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని వీరన్న గట్టు సమీపాన, రామళ్లకోట వైపు బ్రిడ్జ్ అవతల గల 816, 817 సర్వే నంబర్లలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1982లో పౌల్ట్రీ ఫారాలు, డెయిరీ ఫారాల కొరకు ఎస్సీలకు 6.46 ఎకరాలు మంజూరు చేశారు. ఆ భూములలో లబ్ధిదారులు కోళ్ల ఫారాలు, గేదెల ఫారాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించారు. నష్టాల బారిన పడినవారు ఫారాలు ఎత్తివేశారు. ఇటీవల కొందరు లబ్ధిదారులు ఆ స్థలాలను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఈడీ విజయలక్ష్మి మంగళవారం స్థానిక వీఆర్‌ఓ ప్రసాద్‌తో కలిసి ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటికీ ఆయా భూములు ఎస్సీ కార్పొరేషన్ పేరిటనే ఉన్నాయని, లబ్ధిదారులు తమ అభివృద్ధికి మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఆ స్థలాలను అమ్మడానికి వీలుకాదన్నారు. ఎవరైనా స్థలాన్ని అమ్మినట్లు రుజువైతే తిరిగి కార్పొరేషన్ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. ప్రస్తుత విచారణ వివరాలు ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి

ఎమ్మిగనూరురూరల్: వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక సూచించారు. ఆమె మంగళవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. వార్డులు, గదులను పరిశీలించారు. రోగులు, బాలింతలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారని చెప్పారు. ప్రభుత్వాసుపత్రి ప్రసవాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండడంపై సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాల్లోనూ వైద్యం పొందేలా పథకాన్ని విస్తరించారని కొనియాడారు. ఎమ్మిగనూరు ఆస్పత్రి స్థాయి పెంపు వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని, అలాగే ప్రభుత్వాసుపత్రిల్లో ప్రసవం జరిగితే ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేస్తుందని వివరించారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్సార్‌సీపీకి ఘనవిజయం అందిస్తాయన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వంద పడకల హాస్పిటల్‌ను ఆమె పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, సీనియర్ డాక్టర్ బాలాజీకుమార్, డాక్టర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా నీలకంఠ, బుట్టా రంగయ్య, సునీల్‌కుమార్, కౌన్సిలర్ పూజిత తదితరులు ఉన్నారు.

23న రాష్ట్రస్థాయి గిరక బండి పోటీలు

ఆస్పరి: మండలంలోని అట్టెకల్లు గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈనెల 23వ తేదీన రాష్ట్రస్థాయి గిరక బండి పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 20,116, తర్వాతి స్థానాలకు వరుసగా రూ.15,116, రూ.10,116, రూ.8,116, రూ.5,116, రూ.3,116, రూ.2,116, రూ.1,116 నగదు అందించనున్నట్లు చెప్పారు. పాల్గొనే వృషభాల యజమానులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు సెల్ 91825 37760, 88977 67114 నంబర్లను సంప్రదించాలన్నారు.

17న మెగా వైద్య శిబిరం

తుగ్గలి: ఈ నెల 17న పత్తికొండ సాయిబాబా ఆలయం ప్రాంగణంలో కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు కో-ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. శాంతిరాం కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి, గుండె, కిడ్నీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, రేషన్ కార్డు, ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

16న మండల సర్వసభ్య సమావేశం

ఆలూరు రూరల్: ఈ నెల 16వ తేదీన (శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మంగమ్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, కో-ఆప్షన్ మెంబర్, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, ఆయా గ్రామ సర్పంచులు హాజరు కావాలని కోరారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పూర్తి నివేదికతో హాజరుకావాలన్నారు. సమావేశంలో వ్యవసాయం, వైద్యారోగ్యం, రెవెన్యూ, గ్రామీణ మంచినీటి సరఫరా, విద్యుత్ తదితర శాఖల్లో జరిగిన అభివృద్ధి, పురోగతిపై చర్చించనున్నట్లు చెప్పారు.

సిద్ధేశ్వరస్వామి జాతరకు అంకురార్పణ

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 18న జరిగే సిద్ధేశ్వరస్వామి రథోత్సవం ఇతర కార్యక్రమాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో స్వామి విగ్రహాలకు కంకణధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దప్ప, సిద్దమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, నిర్వాహకులు అనంతరం స్వామి వారికి కంకణధారణ చేశారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారి విరాటమూర్తికి మహామంగళారతి, అభిషేకాలు, నైవేద్య సమర్పణ జరిగాయి. అలాగే ఇతర ప్రత్యేక పూజలతో పాటు మాంగల్య నిశ్చితార్థ కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 18న సిద్ధేశ్వరస్వామి రథోత్సవం, 19న లంకాదహనం, 20న కంకణ విసర్జన కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు రూరల్: వాతావరణ మార్పు వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యులు రవి సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు ఆరోగ్య సిబ్బంది ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు, పిల్లలు మధ్యాహ్నం పూట బయటకి రావొద్దన్నారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు.

ఈ - కేవైసీ తప్పనిసరి

తుగ్గలి: మండలంలోని మారెళ్ల, ఉప్పర్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సభ్యత్వం పొందిన వారు, ఖాతాదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆ సంఘాల సీఈఓలు మనోహరనాయుడు, గిడ్డయ్య కోరారు. దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు పొందిన వారు, సభ్యత్వం ఉన్న వారు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, 1బీ జిరాక్సు కాపీలు సింగిల్ విండో కార్యాలయాల్లో అందజేసి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు.



సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయితో మాట్లాడుతున్న బుట్టా రేణుక

పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 6వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ కాలికి గాయమై బాధపడుతుండటంతో మంగళవారం సాయంత్రం బుట్టా రేణుక ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్యం గురించి అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.